ఇగం..జనం ఆగం

- మళ్లీ విజృంభిస్తున్న చలి
- కోహీర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 7.0 డిగ్రీలు
- మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్‌లో 10.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు 7

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- పార్టీలకు అతీతంగా నిజమైన లబ్ధిదారుల ఎంపిక
- గ్రామ సభల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



కంది మండలం చేర్యాల గ్రామసభలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

కంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికి అందిస్తామని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. కంది మండలంలోని కాశీపూర్, చేర్యాల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులను ఎంపికచేసి ప్రభుత్వ పథకాలను అందించడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాల చేరువ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తోందన్నారు. గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జూలకంటి అంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతీలాల్, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గ్రామసభకు హాజరైన నాయకులు, గ్రామస్థులు

ఆర్టీసీకి సంక్రాంతి పండుగ

- ఆదాయం రూ.13.72 కోట్లు
- మెదక్ రీజియన్‌కు రికార్డుస్థాయిలో రాబడి



సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీ (ఫైల్)

సంగారెడ్డిఅర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగింటి పండుగ సంక్రాంతి.. ఆర్టీసీకి లాభాలు తెచ్చిపెట్టింది. సంక్రాంతిని పురస్కరించుకుని సొంత ఊళ్లకు వెళ్లే వారి కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోల పరిధిలో ఈనెల 9వ తేదీ నుంచి 20 వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. మెదక్ రీజియన్‌లోని ఆర్టీసీ ఎనిమిది డిపోల నుంచి 280 ప్రత్యేక బస్సులు నడపడంతో మెదక్ రీజియన్‌కు రికార్డు స్థాయిలో రూ.13.72 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ఈ నెల 9 నుంచి 13 వరకు నడిపిన బస్సుల ద్వారా రూ.6.54 కోట్ల ఆదాయం వచ్చింది. అలాగే ఈనెల16 నుంచి 20 వరకు రూ.7.18కోట్ల ఆదాయం సమకూరింది. సంక్రాంతి ముందు కంటే పండగ తర్వాత ఆర్టీసీకి అదనంగా రూ.64 లక్షల ఆదాయాన్ని అర్జించిందని అధికారులు తెలిపారు.

అర్హులందరికీ న్యాయం చేకూరుతుంది

- కలెక్టర్ మనుచౌదరి

కొండపాక/చేర్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులందరికీ న్యాయం జరుగుతుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం ఆయన కొండపాక మండలం దర్గా గ్రామంలో, చేర్యాల మండలం వేచరేణిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 వరకు ప్రజాపాలన గ్రామ, వార్డుసభలు జరుగుతాయని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు ఈజీఎస్‌లో కూలీలుగా పనిచేసి భూమిలేని రైతు కూలీలను ఎంపిక చేసి సంవత్సరానికి రూ.12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ఇవ్వనున్నట్లు చెప్పారు. వ్యవసాయ యోగ్యం కానీ రాళ్లు రప్పలు ఉన్న భూమి, వివిధ ప్రాజెక్టుల కింద పైన భూమి, రహదారులు, వెంచర్లు తదితర భూములకు రైతుభరోసా ఇవ్వడం కుదరదని తెలిపారు. వితంతువులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వ్యవసాయ కూలీలకు ప్రాధాన్యత క్రమంలో ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. అర్హులెంత మంది ఉన్నా పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని సూచించారు. అంతకుముందు కలెక్టర్ మనుచౌదరి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని సమాధానమందించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ దిలీప్‌కుమార్, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



కొండపాక మండలం దర్గా గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్

కరుణించమ్మా.. కొండపోచమ్మ

- జాతర రెండోరోజు వేలాదిగా తరలివచ్చిన భక్తులు

జగదేవ్‌పూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌నర్సాపూర్ సమీపంలోని అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. సోమవారం సాయంత్రం కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ సన్నిధికి భక్తులు తరలివచ్చారు. జాతర రెండో రోజు మంగళవారం కొండపోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు, చిన్నారులు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య నాట్యం చేస్తూ, శివసత్తులు సిగాలు ఊగుతూ అమ్మవారి సన్నిధికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతంలో కిలోమీటరు మేర భక్తుల కోసం గుడారాలు వెలిశాయి. ఒక్కొక్క గుడారానికి రోజుకు సుమారు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు కిరాయి వసూలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సమస్యలు రాకుండా జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో పర్యవేక్షించారు. ఆలయ ఈవో రవికుమార్, మాజీ సర్పంచ్ రజిత రమేష్‌లు రద్దీని దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద ఉంటూ ఎప్పటికప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరిబాబు ఉన్నారు.



కొండపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



బోనంతో జోగిని శ్యామల

నిలదీతలు..నిరసనలు

- తొలిరోజు రసాభాసగా గ్రామ, వార్డు సభలు
- ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా జాబితాపై గగ్గోలు
- కొత్త రేషన్‌కార్డుల కోసం మళ్లీ దరఖాస్తుల వెల్లువ
- చాలా సభల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం
- పలుచోట్ల పథకాల్లో లోటుపాట్లపై నిలదీసిన ప్రజలు
- ఈనెల 24 వరకు కొనసాగనున్న సభలు

ఇందిరమ్మ ఇళ్లు.. రైతుభరోసా.. కొత్తరేషన్‌కార్డులు.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అర్హుల ఎంపికకు చేపట్టిన గ్రామ, వార్డు సభలు రసాభాసగా మారాయి. మంగళవారం సిద్దిపేట జిల్లాలోని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో అధికారుల నేతృత్వంలో సభలను ప్రారంభించారు. ఈనెల 26 నుంచే ఈ పథకాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో అర్హుల జాబితాలో తమ పేరు ఉందో..లేదోననే ఆందోళన నడుమ ప్రజలు సభలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పథకాల జాబితాలో పేర్లు లేనివారు అధికారులను నిలదీశారు. ఇక చాలా సభల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదాలు తలెత్తాయి. నేడు, రేపు, ఎల్లుండి కూడా సభలు కొనసాగనున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్ది పేట, జనవరి 21

సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ కావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ, వార్డు సభలు కిక్కిరిసాయి. తొలిరోజు కావడంతో జిల్లాలోని 25శాతం గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో సభలను నిర్వహించారు. ఈ సభలకు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజాపాలన దరఖాస్తులు చేసినప్పటికీ తుది జాబితాలో పేర్లు లేకపోవడంతో రాద్ధాంతం జరిగింది. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12వేల సహాయం అందుతున్న క్రమంలో ఈ పథకంలోనూ పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు.



బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామసభలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

మళ్లీ దరఖాస్తుల స్వీకరణ..

గ్రామసభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తులు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో చోటు దక్కలేదని పలువురు అధికారులను నిలదీశారు. కొత్త రేషన్ కార్డుల్లోనూ అన్యాయమే జరిగిందని బాధితులు వాగ్వాదానికి దిగారు. దీంతో మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేస్తే పరిశీలిస్తామని అధికారులు చెప్పుకొచ్చారు. చేసేదేమీ లేక ప్రజలు కూడా దరఖాస్తులు సమర్పించారు. రెండో దశలోనైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామని దరఖాస్తులు ఇచ్చి అసంతృప్తితో వెనుదిరిగారు.



అక్కన్నపేట మండలం రామవరం గ్రామసభలో రసాభాస

సభల్లో పొలిటికల్ వార్..

గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసినప్పటికీ సభల్లో పొలిటికల్ వార్ మాత్రం కొనసాగింది. వచ్చే ఫిబ్రవరి లేదా ఏప్రిల్‌లో గ్రామపంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆశావహులంతా సభలపై ఫోకస్ పెట్టారు. జాబితాలో పేర్లున్న వారి చుట్టూ కాంగ్రెస్ కార్యకర్తలు, పేర్లు రాని వారితో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు చర్చించడం కనిపించింది. ఈ సభలను అనుకూలంగా మార్చుకుందామని కాంగ్రెస్ కార్యకర్తలు భావించగా.. లోటుపాట్లపై బీఆర్ఎస్ కార్యకర్తలు నిలదీసే ప్రయత్నం చేశారు. అందరికీ పథకాలు వర్తించాలని ప్రజల తరఫున గులాబీ శ్రేణులు సభల్లో నినాదాలు చేశారు. ఇక పలు చోట్ల ఫ్లెక్సీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫోటోలు లేవని ఆందోళనకు దిగారు. బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు.

అట్టుడికిన గ్రామసభలు..

- తొగుట మండలంలో జరిగిన గ్రామసభల్లో ప్రజలు వాగ్వాదానికి దిగారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోలేదని అధికారులను నిలదీశారు.

మిగతా 8వ పేజీలో...

తగ్గిన పట్నంవారం ఆదాయం

- గతేడాది రూ.70.22 లక్షలు
- ఈ సారి రూ.61.81లక్షలు
- ఇష్టానుసారం దర్శనాలకు పంపించడంతో రూ.లక్షల్లో గండి !?

చేర్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గతంలో కన్నా కాస్త మెరుగైన వసతులు.. వెనుక దారి గుండా దర్శనాల నిలిపివేత.. ఎటుచూసినా భక్తజన ప్రభంజనం.. ఆలయ పరిసరాలు బండారుమయం.... రెట్టింపుగా మొక్కుబడులు... అయినా ఈ ఏడాది మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల పట్నంవారం ఆదాయం భారీగా తగ్గింది. అయితే, గతేడాది కన్నా రూ.లక్షల్లో ఆదాయం తేడా రావడంతో ఆలయవర్గాల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని యేటా హైదరాబాద్‌కు చెందిన భక్తులు భారీగా తరలివస్తారు. ఈ సారి కూడా అదేస్థాయిలో తరలివచ్చారు. మొక్కుబడులు, ఆర్జిత సేవలు నిర్వహించిన క్రమంలో గతేడాది శని, ఆది, సోమవారాల్లో పట్నాలు, బోనాల, తలనీలాల మొక్కుబడులు, ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె తదితరాల ద్వారా రూ.70.22 లక్షలు ఆదాయం సమకూరింది. ఇక ఈ ఏడాది రూ.61.81 లక్షలు సమకూరింది. బ్రహ్మోత్సవాల్లో ఏయేటికాయేడు ఆదాయం పెరుగుతున్నప్పటికీ, మూడునెలల జాతరలో అతి ప్రధాన ఘట్టమైన మొదటివారంలోనే భారీగా తగ్గడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయాధికారులు, పాలక మండలి సభ్యులు, ఇతరవర్గాల అధికారులు తమతమ అనుయాయులను ఇష్టానుసారంగా వీఐపీ క్యూలైన్, విశిష్ట దర్శన క్యూలైన్ల ద్వారా పంపించడంతో ఆదాయం తగ్గిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా పాసుల జారీ!

వీఐపీలు, దాతలు, భక్తులకు ఈవో లేదా ఏఈవోలు పాసులు జారీ చేసేవారు. అధిక సంఖ్యలో ఉంటే కొంతమందికి దర్శన టికెట్లు రుసుము తీసుకునేవారు. కానీ ఈసారి జాతరలో ఆలయాధికారులతో పాటు ఒకరిద్దరు ధర్మకర్తలు ఎవరికి పడితే వారికి, ఎన్ని అంటే అన్ని పాసులు అందజేశారు. దీంతో ఆలయ ఆదాయం తీవ్రంగా పడిపోయింది. అందుకు గతానికి భిన్నంగా ఈసారి వీవీఐ పీ దర్శన క్యూలైన్ వద్ద నెలకొన్న పరిస్థితి నిదర్శనంగా నిలిచింది. జాతరలో అతికీలకమైన మొదటివారమే గండిపడిన విషయాన్ని గుర్తెరిగి ఆలయవర్గాలు ఇకనైనా తేరుకుని మరో తొమ్మిది వారాల పాటు కొనసాగనున్న జాతరలో ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

నిత్యఅన్నప్రసాద వితరణకు రూ.1,00,116 విరాళం

మల్లన్న ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణకు హైదరాబాద్‌కు చెందిన రాగం రంగస్వామి, రాగం జంగస్వామి మంగళవారం రూ.1,00,116విరాళంగా అందించారు. ఈసందర్భంగా ఆలయ ఈవో రామాంజనేయులు వారికి మహారాజపోషక సభ్యత్వ రసీదు, స్వామివారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీను, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఉన్నారు.



గతంలో ఎన్నడూ లేనంతగా వీవీఐపీ క్యూలైన్ వద్ద నెలకొన్న తాకిడి

పక్షులకు పంకాతో చెక్


- పంట రక్షణకు రైతు కుమారుడి ప్రయోగం



నరేష్‌రెడ్డి

పక్షులు రాకుండా శబ్దం చేసే పంకా

మర్కుక్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆయనో యువరైతు.. తండ్రితో పాటు వ్యవసాయం చేస్తున్నాడు. అయితే, పంటపై వాలిన పక్షులను తరిమేందుకు తన తండ్రి పడుతున్న బాధ చూడలేకపోయాడు. రోజూ ఉదయం లేవగానే తన తండ్రి పొలమంతా తిరుగుతూ పక్షుల్ని తరుముతుంటే.. మరో వైపు వచ్చి వాలుతున్నాయి. ఇలా కదాని ఓ పళ్లెం తీసుకుని కర్రతో దానిపై శబ్దం చేస్తూ పొలమంతా తిరుగుతూ కష్టపడటం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన రుక్మన్నగారి నరేష్‌రెడ్డి చూడలేకపోయాడు. దీంతో చిన్న పాటి వస్తువులతో పంటను పక్షుల నుంచి కాపాడేందుకు పూనుకున్నాడు. ఇందుకోసం ఇంట్లో పాడైపోయిన పాత కూలర్ నుంచి పంకా(ఫ్యాన్ రెక్కలు) తీసుకుని ఓ ఇనుపరాడ్‌కు అమర్చాడు. ఇందు లో ఫ్యాన్‌లోని ఓ రెక్కకు ఇనుప నట్ బిగించాడు. ఆ నట్ తగిలిలా ఫ్యాన్ కింద ఓ స్టీల్ పళ్లెంను అమర్చా డు. ఇక ఆ ఫ్యాన్‌కు కరెంట్ అవసరం లేకుండా గాలి వచ్చేలా అమర్చడంతో.. గాలి వచ్చినప్పుడు ఫ్యాన్ తిరుగుతూ నట్ పళ్లెంకు తగులుతూ శబ్దం చేస్తోంది. దీంతో పక్షులు ఆ పొలం వైపు రావడమే మానేశాయి.







రెండు డీసీఎంలు ఢీ

మనోహరాబాద్ జనవరి 21(ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం రామయాపల్లి జాతీయ రహదారి వద్ద ఎదురెదురుగా రెండు డీసీఎంలు మంగళవారం ఢీ కొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం రామయాపల్లి 44వ జాతీయ రహదారి వద్ద స్క్రాప్‌లోడ్‌తో హైదారాబాద్ నుంచి వస్తున్న డీసీఎం రామాయపల్లి వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఎదురుగా ఉన్న మరో డీసీఎంను ఢీ కొట్టింది. దీంతో డీసీఎంలో ఉన్న స్క్రాప్ జాతీయరహదారి పై పడగా, కొంతసేపు ట్రాఫిక్ జామైంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.







కరువుకు చెక్



పచ్చని పంటలతో గొటిగర్‌పల్లి గ్రామంలోని పొలాలు

- భూగర్భ జలాలను ఒడిసిపట్టేందుకు చెక్‌డ్యాంలు
- పాతికేళ్ల క్రితం ఎటు చూసినా కరువే..
- తాగునీటికీ అప్పట్లో తండ్లాట
- ఇప్పుడు బావులు.. బోర్ల నిండా నీరే
- ఏడాదిలో మూడు పంటలు
- నీటి కొరత చూడని గొటిగర్‌పల్లి
- రాజ్యసభలోనూ ప్రస్తావన

25 ఏళ్ల క్రితం వర్షాలు వస్తేనే ఆ ఊర్లో పంటలు... లేకుంటే విత్తనాలు వేసేవారు కాదు. కనీసం తాగేందుకు నీరు కూడా దొరకడం గగనమే. తాగునీటి కోసం కోసుల దూరం వెళ్లాల్సి వచ్చేది. బోరుబావులన్నీ అడుగంటిపోయేది. ఎంతలోతు తవ్వినా బోరుబావుల్లో నీటి జాడలు కనిపించేవి కావు. 2006 వరకు ఇదే పరిస్థితి. కానీ, ఊరంతా ఒక్కటై సమష్టిగా పని చేశారు. భగీరథ ప్రయత్నం చేసి కరువును జయించారు. ఇప్పుడా ఊర్లో ఏ బావి చూసినా నిండుగా నీరే. బోర్లలోనూ పుష్కలంగా నీరు. ఒకప్పుడు దుక్కులు దున్ని దిక్కులు చూసిన గ్రామ రైతులు ఇప్పుడు ఏడాదిలో మూడు పంటలు పండిస్తున్నారు. నాడు బీడు భూములుగా కనిపించిన పొలాల్లో ఇప్పుడు పచ్చదనం వెల్లివిరుస్తోంది. అదే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి.

కోహీర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామం నుంచి కరువును తరిమేయాలని నిర్ణయించుకున్న గ్రామస్థులు వర్షపు నీటిని ఒడిసిపట్టాలని భావించారు. తాము ఎంత కష్టపడ్డా ప్రభుత్వ సాయం లేకుంటే ఫలితం ఉండదని, ప్రభుత్వానికి తమ పరిస్థితిని విన్నవించారు. 2001లో అప్పటి ప్రభుత్వం డీపీఏపీ ఆరో దశలో భాగంఆ గొటిగర్‌పల్లికి వాటర్‌షెడ్ పథకాన్ని మంజూరు చేసింది. ఇందుకు గారు రూ. 30 లక్షలను మంజూరు చేసింది. ప్రభుత్వం, అధికారులు అండగా నిలవడంతో గ్రామస్థులంతా సమష్టిగా నడుం బిగించారు. వీరికి తోడుగా విశ్రాంత ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ జన వనరుల నిపుణులు, కీర్తిశేషులు హనుమంతరావు మట్టి కట్టలతో చతుర్విధ జల ప్రక్రియ విధానాన్ని చేపడుతామని ముందుకు వచ్చారు. అంతా కలిసి రూ. 24 లక్షల వ్యయంతో చతుర్విధ జల ప్రక్రియ విధానంలో వాటర్‌షెడ్ పనులు ప్రారంభించారు. ఖర్చు పెట్టిన రూ. 24 లక్షలు సైతం మళ్లీ కూలి రూపంలో గ్రామస్థులకు, రైతులకే చెందాయి. ఈ కార్యక్రమం పూర్తి కావడానికి దాదాపు నాలుగేళ్ల పట్టింది. పనులు ప్రారంభించిన తొలి రోజు నుంచే రైతులు సత్ఫలితాలు పొందారు. ఐదేళ్లలో గ్రామ పరిసరాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగాయి.

ఊబికి వస్తున్న నీరు..

గొటిగార్‌పల్లి గ్రామంలో వర్షాభావ పరిస్థితుల్లోనూ నీటి కొరత అన్న మాటే వినిపించదు. ఎప్పుడు చూసినా జలవనరుల్లో పదిహేను అడుగుల తోతులోనూ నీరు ఉటుఉంది. గ్రామంలోని ఖాన్‌లోది అనే ప్రాంతంలో కొన్నేళ్లుగా అన్ని కాలాల్లో భూమి నుంచి నీరు ఊబికి వస్తుంటుంది. దీంతో ఆ ఊరి రైతులు ఏటా మూడు పంటలు సాగు చేస్తున్నారు. గతంలో వర్షాధార పంటలు పండించగా, ఇప్పుడు వాణిజ్య పంటలైన అల్లం, అలుగడ్డ, చెరుకు, అరటి వంటి పంటలను సాగు చేస్తున్నారు.

ఏమిటీ చతుర్విధ జల ప్రక్రియ

చతుర్విధ జల ప్రక్రియలో భాగంగా గ్రామంలో మట్టి కట్టలతో చిన్నచిన్న నీటి కుంటలను తవ్వారు. వీలున్న చోట్ల ఇంకుడు గుంతలు నిర్మించారు. సమతల కందకాలను తవ్వారు. ఇందులో 95 శాతం పనులు మట్టితోనే చేపట్టారు. వాగుల ప్రవాహానికి అనుగుణంగా వాటర్‌షెడ్‌లను నిర్మించడంతో, వర్షపు నీటిని ఒడిసిపట్టి నీటిని మళ్లించుకునే అవకాశం వచ్చింది. అంతేకాకుండా భూగర్భజలాలు కూడా పెరిగాయి. వాటర్ షెడ్ల నిర్మాణం వల్ల టాప్ సాయిల్ కొట్టుకుపోకుండా ఉండిపోవడంతో పంటల సాగుకు ఉపయోగంగా మారింది.

రాజ్యసభలో ప్రస్తావన

గొటిగర్‌పల్లి గ్రామంలో చదుర్విధ జల ప్రక్రియ మేరకు చేపట్టిన వాటర్ షెడ్లు.. తర్వాత గ్రామంలో మారిన పరిస్థితులు గతేడాది డిసెంబర్ 5న రాజ్యసభలో ప్రస్తావనకు వచ్చింది. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఈ మేరకు చరుర్విధ జల ప్రక్రియ ద్వారా భూగర్భ జలాలు పెంచుకున్న గొటిగర్‌పల్లి గ్రామాన్ని ప్రస్తావించారు.

సమష్టి కృషితోనే..



గ్రామస్థుల సమష్టి కృషితో వాటర్ షెడ్ల నిర్మాణం చేపట్టాం. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన ఈ విధానాన్ని చేపడితే అన్ని గ్రామాల్లో నీటి కొరత తగ్గుతుంది.

-రాచయ్య, మాజీ సర్పంచు గొటిగర్‌పల్లి

ఏడాదికి మూడు పంటలు ..



గ్రామంలో భూగర్భ జలాలను పుష్కలంగా ఉండడం వల్ల ఏడాది పొడవున్న మూడు పంటలు పండించుకుని లాభాలు పొందుతున్నాం. భూగర్భ జలాలు పెంపొందించడంలో గ్రామస్తులందరి సహకారం ఉంది. ఈ విధానం మిగతా ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం అమలు చేస్తే అందరికీ బాగుంటుంది.

-తుక్కప్ప రైతు గొడిగర్‌పల్లి



ఒంటి గుబ్బడి చెక్ డ్యామ్‌లో నిండుగా ఉన్న నీరు.



గ్రామ శివారులోని ఖాన్‌లోది ప్రాంతంలో ఓ బావిలో నిండుగా ఉన్న నీరు

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

● ఆరు నెలల క్రితం భార్య.. ● అనాథైన ఐదేళ్ల కూతురు



కనకయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బీనమైన కనకయ్య(36) వ్యవసాయ కూలి. అతడి భార్య ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకోగా, అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్నాడు. దీనికి ఆర్థిక ఇబ్బందులు తోడవ్వడంతో సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో వారి ఐదేళ్ల కూతురు అనాథగా మారింది. గ్రామస్థులు చందాలు వేసుకుని కనకయ్య అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నారికి మానవతావాదులు అండగా నిలువాలని స్థానికులు వేడుకుంటున్నారు.

రైలు కిందపడి ఇంటర్ విద్యార్థిని..



భార్గవి (ఫైల్)

చిన్నకోడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చదువుకుంటున్న జిల్లా విద్యార్థిని మంగళవారం అక్కడే ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన దర్శనం చంద్రయ్య, బాలవ్వ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కుమార్తె భార్గవి(17) ఓయూ క్యాంపస్ ఆంధ్ర మహిళా సభ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతుంది. భార్గవి ఓ వ్యక్తితో చాటింగ్ చేయడం ఆమె అక్కకు తెలిసింది. ఈ విషయం తల్లిదండ్రులకు చెబుతుందేమోనని భయపడిన భార్గవి మంగళవారం జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ సమీపంలో తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ ఏజెన్సీ వర్కర్..

తూప్రాన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం మాసాయిపేట మండలం కొప్పులపల్లికి చెందిన గౌరారం సాయికుమార్ (22) కొంత కాలంగా తూప్రాన్ పట్టణంలోని మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడం, సోదరి వివాహం చేసుకుని వెళ్లడంతో ఒంటరిగా ఉంటున్న సాయికుమార్ తూప్రాన్ పట్టణానికి వచ్చి ఏజెన్సీ వాళ్ల ఇంట్లోని ఓ గదిలో నెల రోజులుగా ఉంటున్నాడు. మంగళవారం విధులకు వెళ్లలేదు. దీంతో యజమాని సాయంత్రం గదిలోకి వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి మృతి గల కారణాలు తెలియరాలేదు.

ఏడో తరగతి విద్యార్థి ఆకస్మిక మృతి



నితిన్ (ఫైల్)

నారాయణఖేడ్,జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఆకస్మికంగా మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖేడ్ పట్టణంలోని ఇందిరా నగర్‌కాలనీకి చెందిన జయమ్మ కుమారుడు కొండవీటి నితిన్(12) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లడానికి తయారై బ్రెడ్ తిని టీ తాగాడు. కొద్ది సేపటికి శ్వాస ఆడటం లేదని ఇబ్బంది పడుతుండగా వెంటనే స్థానిక ఏరియా వైద్యశాలకి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎలాంటి జబ్బు లేకున్నా నితిన్ అకస్మాత్తుగా మృతి చెందడటంతో కాలనీ వాసులు కంటతడిపెట్టారు. గుండెపోటు రావడం వల్లే మృతి చెందినట్లు కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

40 ఎకరాల్లో చెరకు పంట దగ్ధం

● రూ.కోటి మేర నష్టం

జహీరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామశివారులోని 15మంది రైతులకు సంబంధించిన 40 ఎకరాల వ్యవసాయ పొలంలో మంగళవారం మధ్యాహ్నం షార్టుసర్క్యూట్‌తో చెరకు పంట దగ్ధమైంది. సుమారు 2వేల టన్నుల చెరకు పంట పూర్తిగ కాలి బూడిదైందని రైతులు తెలిపారు.చెరకుపంట, డ్రిప్ పైపులు తదితరాలు కలిసి సుమారు రూ.కోటీ మేర నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. అగ్నిమాపకసిబ్బంది వెళ్లేసరికి దాదాపు పంట మొత్తం కాలిపోయింది. అక్కడికి వెళ్ళిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాలిపోయిన పంటపొలాలను మొగుడంపల్లి రెవెన్యూఅధికారులు వెళ్ళి పరిశీలించారు. పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఇగం..జనం ఆగం

- మళ్లీ విజృంభిస్తున్న చలి
- కోహీర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 7.0 డిగ్రీలు



కోహీర్‌లో దట్టమైన పొగ మంచు

కోహీర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి మళ్లీ విజృంభిస్తున్నది. మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 25 నుంచి 30 డీగ్రీలు ఉంటుండగా, రాత్రి, ఉదయం వేళల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో మూడు రోజులుగా సింగల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. ఉదయం చలికి తోడు పొగ మంచు కప్పేస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. జనవరి 10 నుంచి 18 వరకు చలి నుంచి కాస్త ఉపశమనం కలిగినప్పటికీ 19వ తేదీ రాత్రి నుంచి మళ్లీ పెరుగుతూ వస్తోంది. ఈ నెల చివరి వరకు ఇదే తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మంగళవారం ఉదయం సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కోహీర్‌లో 7.0 ఉష్ణోగ్రత నమోదు కాగా మెదక్ జిల్లాలోని శివంపేట్‌లో 10.5 నమోదైంది. ఇక సిద్దిపేట జిల్లాలోని మర్కుక్ మండలంలో గల అంగడికిష్టాపూర్‌లో 10.2 ఉష్ణోగ్రత నమోదయింది.

నక్కల కులస్థులకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలి

● రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తొగుట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నివసిస్తున్న నక్కల (పిట్టల) కులస్థులకు ఎస్టీ సర్టిఫికెట్ మంజూరీ చేసేవిధంగా చూడాలని సామాజిక సమరసత వేదిక కేంద్ర సమితి సభ్యులు అప్పాల ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు, నక్కల కుల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెతుకు రాజు, సంచార జాతుల రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. తొగుట మండలం గోవర్ధనగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నముత్యంపేటలో ఈ కులస్థులు కడు పేదరికంలో మగ్గుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వీరికి ఎస్టీ సర్టిఫికెట్ ఇచ్చారని, కొన్నేళ్లుగా ఇవ్వకపోవడంతో పాటు బీసీ సర్టిఫికెట్ తీసుకోవాలని అధికారులు ఒత్తి తెస్తున్నట్లు తెలిపారు. ఎస్టీ సర్టిఫికెట్ లేక విద్యకు, ప్రభుత్వ పథకాలు దూరమవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం రిటైర్డు జాయింట్ డైరక్టర్ అంకం శంకర్, సంచార జాతుల సంఘం నాయకులు కాల్య యాదగిరి, తుమ్మల రాజు, తుమ్మల చిన్న అంబయ్య పాల్గొన్నారు.

ఆర్చరీలో చికితకు స్వర్ణం



చికితను సన్మానిస్తున్న పవన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కొల్లూర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో టి.చికితరావు స్వర్ణ పతకం సాధించింది. కాంపౌండ్ విభాగంలో చికిత 697 పాయింట్లతో పసిడి పతకం కైవసం చేసుకుంది. ఎన్.మానస రజతం, ఎం.శ్రేష్ఠ రెడ్డి కాంస్యం నెగ్గారు. గతవారం జరిగిన జాతీయ స్థాయి ట్రయల్స్‌లో ప్రతిభ కనబర్చి ఫిబ్రవరిలో జరిగే ఆసియా కప్, ఏప్రిల్‌లో జరిగే ప్రపంచకప్‌కు ఎంపికైన చికితను డీపీఎస్ కరస్పాండెంట్ టి.ఎస్ పవన్ కళ్యాణ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎస్ చైర్మన్ టి.భీమ్‌సేన్, వైస్ చైర్మన్ టీవీ ప్రణయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి అవమానం..!

సరస్వతి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు



నిజాంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చదువుల తల్లికి అవమానం జరిగింది. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ హైస్కూల్‌లోని సరస్వతి మాత విగ్రహాన్ని సోమవారం అర్ధరాత్రి దుండగులు పెకిలించి మెట్లపై పడవేశారు. మంగళవారం గుర్తించిన విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ నేతలు వీరికి మద్దతుగా నిలిచారు. సుమారు గంటపాటు నార్లాపూర్-కల్వకుంట రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్, ఎంఈవోలు ఘటనా స్థలికి చేరుకొని వారిని సముదాయించారు. దుండగులను వీలైనంత త్వరగా పట్టుకొని అరెస్టు చేస్తామని నచ్చజెప్పడంతో ఎట్టకేలకు ధర్నా విరమించారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో కొందరు ఆకతాయిలు అక్కడ తరచూ మద్యం సేవిస్తూ బాటిళ్ల పడవేసిన సంఘటనలు ఉన్నాయి.



శాటిలైట్ సదస్సును ప్రారంభిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

ఐఐటీహెచ్‌లో శాటిలైట్ సదస్సు

కంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో మంగళవారం అంతర్జాతీయ శాటిలైట్ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీల్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఇండియా సౌత్‌చాప్టర్ సహచైర్మన్ డాక్టర్ రామ్‌నాథ్ మణి మాట్లాడుతూ ఐఐటీ పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం ద్వారా గ్రామీణ, పెరీ అర్బన్ ప్రాంతాల్లో సమస్యలకు సాంకేతికత ఆధారిత పరిష్కారాలను చూపుతున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత సాధనాలు శ్రామిక మహిళల పనిభారాన్ని తగ్గిస్తాయన్నారు. కార్యక్రమం ద్వారా ప్రాంతీయ వనరుల అన్వేషించడానికి సరికొత్త మార్గాలను కనుగొంటున్నామని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీలు లక్ష్యాలను చేరుకోవాలి

● తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిబాయి

గజ్వేల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఆయా మార్కెట్ కమిటీల కార్యదర్శులతో ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. లక్ష్యాలను చేరుకున్న కార్యదర్శులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్దిత గడువులోగా టార్గెట్ పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా లక్ష్యాలను పూర్తి చేసేందుకు చేపట్టవలసిన చర్యలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా మార్కెట్ అధికారి, ఆయా మార్కెట్ కమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భార్య మీద కోపంతో కూతురిని చంపిన తండ్రి

- గొంతు నులిమి బావిలో పడేసిన వైనం
- అమ్మ దగ్గరకి తీసుకెళ్తానని చెప్పి హత్య
- సంగారెడ్డి జిల్లాలో దారుణం, నిందితుడి అరెస్టు



వైష్ణవి(ఫైల్)

రాయికోడ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లాడిన భార్య తన వేధింపులు తాళలేక పుట్టింటికి వెళ్లిపోతే.. ఆమెపై కోపాన్ని కన్నబిడ్డ మీద చూపించాడో తండ్రి. అమ్మ దగ్గరికి తీసుకెళ్తానని చెప్పి నమ్మించి కూతురిని తీసుకెళ్లి.. గొంతు నులిమి ఊపిరి తీసి మృతదేహాన్ని బావిలో పారేశాడు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో జనవరి 9న ఈ దారుణం జరగ్గా.. కన్నబిడ్డను చంపిన ఆ తండ్రిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు, రాయికోడ్ ఎస్‌ఐ నారాయణ ఈ కేసు వివరాలను విలేకరులకు మంగళవారం వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. రాయికోడ్ మండలం సంగాపూర్‌కు చెందిన మధుగడ్డ సతీశ్, ఎరుకలి అనిత ఒకరినొకరు ప్రేమించుకుని 12 ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి వైష్ణవి (11), హరిత (6) అనే కుమార్తెలు ఉండేవారు. సతీశ్ అనుమానంతో అనితను తరచూ వేధిస్తుండేవాడు. ఈ వేధింపులు తాళలేక భర్త, పిల్లలను వదిలేసి అనిత ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పట్నించి సతీశ్ తల్లి సామమ్మ పిల్లల బాగోగులు చూసేది. అయితే, సతీశ్ భార్య మీద కోపంతో రగిలిపోతుండేవాడు. చిన్న కుమార్తె హారిక అనారోగ్యంతో రెండు నెలల క్రితం మరణించింది. అప్పట్నించి వైష్ణవి తన తల్లి దగ్గరికి వెళ్లిపోతానని అడిగేది. అయితే, భార్య తనని వదిలేయడం, ఉన్న కూతురు తన దగ్గర ఉండనని అంటుండంతో.. సతీశ్ తన కూతురిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అమ్మ దగ్గరకు తీసుకెళ్తానని చెప్పి జనవరి 9వ తేదీ తెల్లవారుజామున సతీశ్ తన కూతురు వైష్ణవిని గ్రామ శివారులోని ఓ బావి వద్దకు తీసుకెళ్లాడు. ఇక్కడికి ఎందుకు తెచ్చావు అని కూతురు ప్రశ్నించగా.. ఆమె గొంతు నులిమి ప్రాణం తీసి మృతదేహాన్ని బావిలో పారేసి ఇంటికి తిరిగి వచ్చాడు. వైష్ణవి ఏదని తల్లి సామమ్మ ప్రశ్నించగా సతీశ్ పొంతన లేని సమాధానాలు చెప్పాడు. అక్కడికి వారం తర్వాత బావి వద్ద వైష్ణవి దుస్తులు, ఆధార్‌కార్డు, చెప్పులు గుర్తించిన స్థానికులు విషయాన్ని సామమ్మకు చెప్పారు. సామమ్మ ఫిర్యాదుతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వైష్ణవి మృతదేహాన్ని వెలికి తీసి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సతీశ్‌ను ప్రశ్నించగా అసలు నిజం బయటపడింది.

250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జోగిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సంగారెడ్డి జిల్లా జోగిపేట పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం లారీలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చింది. ఈ మేరకు మంగళవారం ఉదయం జోగిపేట పట్టణంలోని బసవేశ్వర విగ్రహం వద్ద బియ్యం లోడుతో ఉన్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, రెవెన్యూ అధికారులు బియ్యాన్ని పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. నారాయణ ఖేడ్‌లోని సివిల్ సప్లయ్స్ గోదాముకు బియ్యాన్ని తరలించామని, లారీ డ్రైవర్ యూసుఫ్‌ను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హెచ్‌ఎండీఏ వెంచర్‌లో విద్యుత్ వైర్లు చోరీ

● రూ.2లక్షల విలువైన తీగలు మాయం

కంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అల్యూమినియం తీగలు చోరీకి గురైన సంఘటన కంది మండల పరిధిలోని చేర్యాల శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఇంద్రకరణ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల శివారులోని కంది-శంకర్‌పల్లి హైవే పక్కన ప్యారడైజ్ ఇన్‌ఫ్రా పేరిట 12ఎకరాల్లో హెచ్‌ఎండీఏ వెంచర్ ఉన్నది. సోమవారం అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వెంచర్‌లోనికి చొరబడి రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన ఫీజులను తొలగించి ఎల్టీ లైన్ స్తంభాల పైకి ఎక్కి విద్యుత్ తీగలను కత్తిరించుకుని తీసుకెళ్లారు. దాదాపు 30 స్తంభాలకు చెందిన నాలుగు వరసలు గల విద్యుత్ అల్యూమినియం తీగలను తస్కరించారు. మంగళవారం ఉదయం విధులకు హాజరైన వెంచర్ సూపర్‌వైజర్ హాజీ విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెల్లడించారు. రూ. 2 లక్షల విలువ చేసే విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు విద్యుత్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎల్లమ్మ తల్లీ.. మన్నించమ్మా!

- నేలపై పారుతున్న కల్లు, బెల్లం సాక
- తొక్కుళ్లతో అపవిత్రమౌతున్నదని భక్తుల ఆవేదన
- పైప్‌లైన్ సరిగా లేక మెట్లపై నుంచి పారుతున్న సాక నీరు
- భక్తులు ఎమరుపాటుగా ఉంటే గాయాలే
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి



మల్లన్న గుట్టపై కొలువుదీరిన ఎల్లమ్మ, కల్లుసాక పోస్తున్న ఓ భక్తురాలు, చిత్తడిమయంగా మారిన మెట్లపైనుంచి ప్రమాదకర పరిస్థితుల్లో నడుస్తున్న భక్తులు

చేర్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి గుట్టపై కొలువుదీరిన ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటేనే పుణ్యప్రాప్తితో పాటు మల్లన్న ఆశీస్సులు దక్కుతాయని ప్రతీతి. అమ్మవారికి భక్తులు మొక్కుబడులుగా బోనం నివేదించి కల్లు, బెల్లం పానకం సాక పెట్టడం ఆనవాయితీ. ఏటా మూడునెలల పాటు కొనసాగే మహాజాతర సమయంలో భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో చెల్లించుకుంటున్న మొక్కులు తొక్కిళ్లతో అపవిత్రం కావడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతర సమయంలో గద్దెతో పాటు ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో నేలపైనే సాక పెట్టే తంతు చేస్తుండటంతో కాళ్ల కింద అపవిత్రమవుతూ కాలినడకకు ఆటంకంగా మారుతుంది.

మెట్లపైన సాకనీటితో చిత్తడి

ఈయేడాది ఆలయ ప్రాంగణంలో భక్తులు సాక పోయడానికి చర్యలు తీసుకున్నా పైప్‌లైన్ సక్రమంగా ఏర్పాటుచేయకపోవడంతో పాటు కొబ్బరికాయలు కొట్టిన తరువాత నీటి ప్రవాహ మళ్లింపునకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు. దీంతో సాక నీరు, వృథా నీరు కలిసి గుట్టకిందికి దిగడానికి వీలుగాఉన్న మెట్లపైనుంచి పారడంతో మట్టిమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కేవారి తాకిడి నెలకొనడంతో భక్తులు నానాతంటాలు పడుతున్నారు. మెట్లపై తడి, బురదగా మారడంతో ఏమాత్రం జారినా గాయాలపాలయ్యే పరిస్థితి నెలకొన్నది. ఆరుబయట పోసే సాక చివరి మెట్టువరకు ప్రవహిస్తుండటంతో తొక్కిళ్లతో మలినపడుతున్నాయి.

భక్తుల మనోభావాలను పట్టించుకోరా?

కల్లు సీసాలు ఎక్కడ పడితే అక్కడ పారేయడం, పగలగొడుతుండటం వల్ల పాదచారులకు గుచ్చుకుంటున్నాయి. భక్తుల మనోభావాలతో కూడిన సున్నిత అంశంపై కూడా ఆలయ వర్గాలు ఏమాత్రం దృష్టిసారించకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు సేదతీరేందుకు వీలుగా ఏర్పాట్లు చేపట్టకపోవడంతోనూ ఇక్కట్లు తప్పడం లేదు. సాక పెట్టిన అనంతరం కల్లును ప్రసాదంగా సేవిస్తున్నా, ఆవరణలోని గుట్టలు, చెట్టునీడతో పాటు మెట్లపై కూర్చుంటున్నారు. ఇటీవల పట్నంవారం సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు మలినంగా మారడంతో భక్తులు ఇబ్బందులు పడుతూనే అమ్మవారికి దండం పెట్టుకున్నారు. ఈవిషయమై ఆలయాధికారులు, పాలకమండలి ప్రత్యేక చొరవ వహించి సాక తొక్కిళ్లపాలు కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి భక్తుల మనోభావాలు పరిరక్షించాలని, గుట్టపై సేదతీరడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పారిశుధ్య చర్యలేవీ?

పట్నంవారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి ఆరుబయట బోనాలు, వంట తయారు చేసుకోవడంతో పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఆలయ పరిసరాలు చెత్త, చెదారంతో నిండిపోయాయి. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు సూచిస్తున్నా, కింది స్థాయి అధికారులు, సిబ్బంది ఆచరణలో విఫలమయ్యారు. దీనికితోడు డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లడంతో మురుగునీరు రోడ్డుపైనుంచి ప్రవహించి ఆయా పరిసరాలు కంపు కొడుతున్నాయి.రెండురోజులుగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం పట్ల భక్తులతో పాటు స్థానికులు మండిపడుతున్నారు.



కోడెలస్తంభం సమీపంలోని వసతి గదుల గుండా ప్రవహిస్తున్న మురుగునీరు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్



సిద్దిపేట క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మల్టీ లెవెల్ మార్కెటింగ్ ద్వారా ఎక్కువ మొత్తంలో లాభాలు పొందవచ్చనే అసత్యప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రజలను హెచ్చరించారు. గజ్వేల్, జగదేవపూర్, చేర్యాల్, మద్దూర్, సిద్దిపేట పట్టణం ఏరియాలో ఇలాంటి ప్రచారం జరుగుతుందని గుర్తు చేశారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ద్వారా క్రిప్టోకరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్, హెర్బల్ అండ్ హెల్త్, గృహ పరికరాలు వంటి వాటి పైన పెట్టుబడి పెట్టడం ద్వారా ఎక్కువ మొత్తంలో లాభాలు గడించవచ్చు అనే ప్రచారం ద్వారా సైబర్ నేరగాళ్లు అమాయకులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. మొదటగా చిన్నమొత్తంలో పెట్టుబడి పెట్టినవారికి చిన్న మొత్తంలో లాభాలు ఇస్తూ, ఎక్కువ మొత్తంలో రావడానికి ఇంకా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని వాళ్లను మభ్యపెడ్తూ కొత్త స్కీమ్‌లతో బహిరంగ మార్కెట్లోకి వస్తున్నారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి వాటిని నియంత్రించాలంటే సోషల్ మీడియాలో వచ్చే అనుమానిత లింకులను ఎవరూ ఓపెన్ చేయవద్దని, క్రిప్టో కరెన్సీ లాంటి మల్టీ లెవెల్ మార్కెటింగ్‌కు సంబంధించిన గ్రూపుల్లో ఎవరు కూడా సభ్యత్వం కల్గి ఉండొద్దన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

గజ్వేల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): యువకులు గంజాయి తదితర మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి. సైదా సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో, గజ్వేల్ పట్టణంలో యువకులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నియమాలను, మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాలను గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు.

ఎర్త్ ఫౌండేషన్ రాష్ట్రస్థాయి పోటీలు



కబడ్డీలో పోటీ పడుతున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాంస్కృతిక, క్రీడా పోటీలు మంగళవారం సిద్దిపేట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే పోటీల్లో ఎర్త్ ఫౌండేషన్ దత్తత తీసుకున్న 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా చిత్రలేఖనం, వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి ప్రభాకర్ రెడ్డి, ఎర్త్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు కలవెని శ్రీనివాస్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ బ్యాంక్‌లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఉండాలి

- బ్యాంకర్లతో సమీక్షలో సీపీ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ బ్యాంకులో సీసీ కెమెరాలు 360 డిగ్రీల కోణంలో పని చేసే విధంగా ఏర్పాటు చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్లకు సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. సిద్దిపేట జిల్లాలో ఉన్న బ్యాంక్ మేనేజర్లు, రీజనల్ మేనేజర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తో బ్యాంకుల అంతర్గత భద్రత, ఏటీఎంలో భద్రత, సీసీ కెమెరాల పనితీరు గురించి ఆమె మంగళవారం కమిషనర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, బ్యాంకులో ఏ సంఘటన జరిగినా అలారం సిస్టం పనిచేసే విధంగా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకులలో ఏదైనా సంఘటన జరిగితే కేసుల పరిశోధనలో బ్యాంకు అధికారులు సహకరించాలని సూచించారు.బ్యాంకులో తప్పకుండా సెక్యూరిటీ మేజర్స్ తీసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లాలో ఉన్న 160 బ్యాంకుల్లో పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేశామన్నారు రాత్రి, పగలు సమయంలో పోలీస్ అధికారులు రోజుకు రెండు సార్లు బ్యాంకును తనిఖీ చేసేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. బ్యాంకు మేనేజర్లు సంబంధిత పోలీసు అధికారుల సెల్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఏదైనా సంఘటన జరిగితే త్వరగా సమాచారం ఇచ్చే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. బ్యాంకు అధికారులు పోలీసు అధికారులు ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

బ్యాంకు పోలీస్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి సైబర్ నేరాలు జరిగిన బాధితులకు డబ్బులు రికవరీ అయ్యే విధంగా కోఆర్డినేషన్‌తో విధులు నిర్వహించాలని సీపీ సూచించారు.

సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికి చేర్యాలలో కోర్టు అదనపు బాధ్యతలు

చేర్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిఫ్ కోర్టులో ఇక నుంచి ప్రతీ శుక్రవారం కోరు సేవలు అందనున్నాయి. అందుకు సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా శ్రావణియాదవ్ వ్యవహరిస్తున్నారు. రెండేళ్ల క్రితం చేర్యాలకు మున్సిఫ్‌కోర్టు మంజూరైనప్పటికీ ప్రత్యామ్నాయచర్యల్లో ఆలస్యమైన విషయం విదితమే. ఈ నెల 11న హైకోర్టు జడ్జి భవనాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. కోర్టు కార్యకలాపాల నిర్వహణకు 27పోస్టులు మంజూరైనప్పటికీ నియామకప్రక్రియకు సమయం అవసరమైనందున వారానికి ఒకరోజు సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రతీ శుక్రవారం కొనసాగించేందుకు సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా శ్రావణియాదవ్‌కు అదనపుబాధ్యతలు అప్పగించారు. పొరుగు కోర్టులకు చెందిన సిబ్బందిని తాత్కాలికంగా నియమించారు. దీంతో మరో రెండు రోజుల్లో చేర్యాలలో స్థానికంగానే కోర్టు సేవలు అందనున్నాయి.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి. జ్యోత్స్నాదేవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అలాగే 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల కోసం కూడా విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. 5వ తరగతిలో 60 సీట్లు మైనార్టీ విద్యార్థులకు, 20 సీట్లు ఇతరులకు, అలాగే ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ఒక్కో గ్రూపులో 30 సీట్లు మైనార్టీలకు, 10 సీట్లు ఇతరులకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7995057923, 8142657688 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

హుస్నాబాద్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగిడి నరసింహారెడ్డి, కార్యదర్శిగా సత్తు మహిపాల్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాలపురం సుభాష్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర రాజేందర్, ఎన్నికల అధికారులు కాయిత నారాయణరెడ్డి, కాశిరెడ్డి ఆదిరెడ్డి, అంజయ్య, శైలేందర్ తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

సిద్దిపేట అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు డిసెంబర్ నెల వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన పండుగల సమయంలో కూడా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తమ కష్టాన్ని గుర్తించి సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఫోన్‌లో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలి



కుకునూరుపల్లి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవో బచ్చలి సత్తయ్య

గజ్వేల్/కుకునూరుపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని గజ్వేల్, కుకునూరుపల్లి ఎంఈవోలు వై.కృష్ణ, బచ్చలి సత్తయ్య సూచించారు. మంగళవారం గజ్వేల్ మండల పరిధిలోని అహ్మదీపూర్, కుకునూరు మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రతి రోజూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ఎఫ్‌ఆర్ఎస్ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అపార్ కార్డులను విద్యార్థులు, తల్లిదండ్రుల అనుమతితో ప్రతీ ఒక్కరికి ఉండేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పదో తరగతి, ఇతర అంశాలలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. కాంప్లెక్సు టీచర్లు, ఆర్పీలు, టీచర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్దూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలాఖ్‌పూర్, వల్లంపట్ల గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయపోల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన పబ్బా శ్రీనివాస్ అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడని పోలీసులకు సమాచారమందింది. దీంతో రెండు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి, 9 క్వింటాళ్లకు పైగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని బేగంపేట పోలీసులకు అప్పగించి, పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీటీసీఎస్ రాజిరెడ్డి సోమవారం సాయంత్రం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసి బియ్యాన్ని దౌల్తాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం సభ్యులు

కుకునూరుపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్‌మిషన్ సభ్యులు కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆరోగ్య కేంద్రంలో వసతులు, సరిపడా సిబ్బంది, రోగులకు అందిస్తున్న పలు రకాల సేవలను పరిశీలించారు. వివిధ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తున్నారా.. లేదా అని తనిఖీ చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యాధికారిని అఖిల పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయి



దౌల్తాబాద్‌లో ఆటో యూనియన్ జెండాను ఎగురవేస్తున్న మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్

దౌల్తాబాద్,జనవరి21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల బతుకులు అగమయ్యాయని బీపీటీ ఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ అల్లూరి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో ఈఎంఎస్ అనుబంధ సంస్థల ఆటో, టాక్సీ డ్రైవర్స్ యూనియాన్ అధ్యక్షుడు దేవేందర్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దౌల్తాబాద్ మాజీ సర్పంచ్‌లు ఆది వేణుగోపాల్, రమేష్ హాజరై జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ అల్లూరి మాట్లాడుతూ. ఉచిత బస్సు వల్ల అనుక మంది ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆటో డ్రైవర్లను విస్మరిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన గ్రామసభలు

- లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవంటూ పలుచోట్ల వాగ్వాదాలు





కుకునూరుపల్లి: తిప్పారం గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, హుస్నాబాద్ కస్తూర్బా కాలనీలో మున్సిపల్ కమిషనర్‌తో మహిళల వాగ్వాదం

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా మంగళవారం గ్రామసభలను ప్రారంభించారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో గ్రామ, వార్డు సభలను నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను స్థానికుల సమక్షంలో అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కాగా లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాలేదంటూ పలుచోట్ల ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సిద్దిపేట పట్టణంలోని 1, 9 వార్డుల్లో మంగళవారం తొలిరోజు వార్డు సభలను మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు అధ్యక్షతన ప్రారంభించగా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, ఆయా వార్డుల ప్రజలు సభల్లో పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు ప్రకటించిన జాబితాలో అనర్హులను చేర్చారణలతో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దరఖాస్తులను స్వీకరించి, మరోసారి పరిశీలిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 1, 2,3,4,5వార్డుల్లో వార్డు సభలను మునిసిపల్ చైర్మన్ రాజమౌళి అధ్యక్షతన మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య నిర్వహించారు. గజ్వేల్ 3వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో రేషన్ కార్డులకు కొందరినే అర్హులుగా ప్రకటించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జాలిగామ గ్రామంలో నిర్వహించిన సభలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పాల్గొని సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తొలిరోజు 5 వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరించారు. పలువార్డు సభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జాబితాలో తమ పేర్లు లేవని ఆందోళనకు దిగారు. ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకొని గ్రామసభ నుంచి బీఆర్ఎస్ నాయకులను బయటకు పంపించారు. అదేవిధంగా దౌల్తాబాద్, దుబ్బాక, మిరుదొడ్డి,అక్బర్‌పేట-భూంపల్లి, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, హుస్నాబాద్, దూళిమిట్ట, ములుగు, కుకునూరుపల్లి, మర్కుక్, తదితర మండలాల్లో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. పలుచోట్ల అర్హుల పేర్లు జాబితాలో కనిపించడం లేదంటూ స్థానిక ప్రజలు అధికారులను నిలదీశారు. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.



సిద్దిపేట అర్బన్:ఎన్సాన్‌పల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

నిలదీతలు.. నిరసనలు

(5వ పేజీ తరువాయి)

- దూళిమిట్ట మండలం జాలపల్లిలో అనర్హుల పేర్లు జాబితాలో ప్రకటించారని పలువురు గ్రామసభను అడ్డుకునే ప్రయత్నం చేశారు.
- మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని సభల్లో అర్హులైన లబ్ధిదారుల పేర్లు రాలేదని నిలదీయగా మళ్లీ దరఖాస్తులు చేయడానికి కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు వాగ్వాదం జరిగింది. అనర్హులను జాబితాలో చేర్చారంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.
- నారాయణరావుపేట మండలం మల్యాల, లక్ష్మీదేవిపల్లి, ఇబ్రహీంపూర్, సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, రావురూకులలో నిర్వహించిన సభలు రసాభాసగా మారాయి. అర్హులకు జాబితాలో చోటు దక్కలేదని ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీశారు.
- చిన్నకోడూరు మండలం మాచాపూర్ సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం జాబితాలో తమ పేర్లు రాలేదని గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు.
- మద్దూరు మండల గ్రామసభల్లోనూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా జాబితాలపై నిలదీతలు తప్పలేదు.
- అక్కన్నపేట మండలం రామవరంలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు రాకపోవడంపై లబ్ధిదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.
- దౌల్తాబాద్ మండలం కోనాపూర్ సభ రసాభాసగా మారింది. గతంలో నిర్మించిన పాత డబుల్ బెడ్రూంలను పూర్తిచేసి పేదలకు అందించాలని లేవనెత్తారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జాబితాలో అర్హులకు చోటు దక్కలేదని నిలదీశారు.
- బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామసభకు హాజరైన మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో బీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. జాబితాల్లో అర్హులకు చోటు దక్కలేదని ఎమ్మెల్యేను నిలదీశారు.

హుస్నాబాద్‌కు చేరిన బీసీ నాయకుల సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్ర చేస్తున్నవారిని సన్మానిస్తున్న నాయకులు

హుస్నాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను పెంచాలని రెండు రోజుల క్రితం కిలాసాపురంలో బీసీ నాయకులు చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం సాయంత్రం హుస్నాబాద్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర చేస్తున్న బీసీ నాయకులు చాపర్తి కుమార్ గాడ్గె, బత్తుల సిద్ధేశ్వర్‌ల బృందాన్ని స్థానిక బీసీ నేతలు సన్మానించారు. బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాయకులు తదితరులున్నారు.

ప్రజా పాలన కాదు.. కాలయాపన సభలు

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సభలు, గ్రామసభలు, వార్డు సభలు అంటూ కాలయాపన తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజా పాలన సభలో దరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డులు ఇప్పటివరకు మంజూరు చేయకుండా పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ దరఖాస్తు తీసుకోవడం ఎందుకని ప్రశ్నించారు.